
# సింగిల్ పేజీ కథలు

## మమకారం

వినయవర్మ త్రికరణ శుద్ధిగల మనిషి. త్రికాల సంధ్యావేత్త. త్రిమూర్తులనూ నిత్యం క్రమం తప్పకుండా ఆరాధించే వ్యక్తి. ఇతని ఏకైక కుమారుడు మధువర్మ. అన్నీ మూడు అనేవి నమ్ముకుంటే ఏకాగ్రత దెబ్బతింటుందన్న నమ్మకం గల మనిషి! ఒక్కొక్కప్పుడు అనుకున్నది చెయ్యడం, చెప్పింది చెయ్యడం కుదరకపోవచ్చును కనుక, "ముందే యిది చేస్తాను, అది, యిదీ చేద్దామనుకుంటున్నాను!" అని చెప్పేకంటే, అవకాశం వున్నప్పుడల్లా యితరులకి సహాయం చేస్తే చాలనుకునే మనిషి. ఆ సహాయం కూడా తనకుమాలిన ధర్మం కూడదనుకుంటాడు. ఇక ఉదయం మాత్రమే సంధ్యవారుస్తాడు



బ్రహ్మ విష్ణు మహేశ్వరుడు అందర్నీ ఆరాధిస్తే కాలాతీతమవుతుందని ఒక్క మహేశ్వరుడ్నే ఆరాధిస్తాడు. పైగా ఈశ్వరుడు ఐశ్వర్యకారకుడు కనుక ఆయనే ముఖ్యమని ఆయన్నే ఆరాధిస్తాడు. ప్రపంచంలో డబ్బు లేకపోతే జీవితం డొల్లని ప్రగాఢంగా నమ్మిన మనిషి.

వినయవర్మకి కొడుకు పద్ధతులు కొన్ని నచ్చవు. ముఖ్యంగా డబ్బుకి ప్రాధాన్యత యివ్వడం అసలు నచ్చదు. మధువర్మ ఎమ్.డి. మంచి మార్కులతో ప్యాసయ్యాడు. ఇతని స్నేహితులు యిద్దరు ముగ్గురు అమెరికా వెళ్ళిపోయారు. మధువర్మ కూడా వెళ్ళిపోతాడని వినయవర్మకి చూచాయగా తెలిసింది. భార్యతో అన్నాడు.

" ఈ ఒక్కగానొక్క కొడుకు అమెరికా వెళ్ళకపోతేనేం. మనం కూడా పెద్దవాళ్ళమైనాం కదా!"

"పెద్దవాళ్ళమైతే అయ్యాంగాని మన ఆరోగ్యాలు బాగానే వున్నాయి కదా! పైగా కోడలు కూడా డాక్టర్ పరీక్ష ప్యాసయింది. వెడితే వెళ్ళనివ్వండి. అందరూ వెళ్ళి శుభ్రంగా సంపాదించుకొస్తున్నారు. పైగా మీరు రిటైర్ అయిపోయారు మనకి సొంత యిల్లు కూడా లేదు. మధు అయినా బాగా సంపాదించి ఒకమంచి యిల్లుకడితే మంచిదే కదా!" అంది వినయవర్మ భార్య.

"అసలు నాకు తెలీక అడుగుతాను. పుట్టిన ప్రతీ మనిషికీ ఒక సొంతయిల్లు వుండి తీరాలంటావా. ఈమధ్య ప్రతీవాళ్ళకీ సొంత యిల్లుమీదే దృష్టి. ఇల్లు యిల్లని నగర శివార్లలో కట్టడం! అక్కడ దొంగలు పడి వీళ్ళని చావకొట్టి వున్నదంతా ఊడ్చుకుపోవడం. అందుకే తెలివైన యింగ్లీషు సామెత పుట్టింది. 'తెలివి తక్కువ వాళ్ళు యిళ్ళు కడతారు, తెలివైన వాళ్ళు అందులో నివసిస్తారు' అని" అన్నాడు వినయవర్మ.

"బాగుంది. అబ్బాయి అమెరికా వెళ్ళి వస్తే మనం నగర శివార్లలో ఎందుకు కడతాం యిల్లు. మంచి సెంటర్లో ఒక ఫ్లాట్ కొనచ్చు"

"నిజమే నీవు తెలివైనదానవు! పన్లో పని నువ్వు బంగారు నగలు కూడా దిగేసుకోవచ్చు!" అన్నాడు వినయవర్మ.

"చూద్దాం యిప్పట్నుంచీ ఎందుకీ గొడవలు. వాడు అసలు వెళ్ళినప్పుడు చూద్దాం!" అంది ఆవిడ.

★ ★ ★

కొన్ని రోజుల తర్వాత కొడుకు అమెరికా వెళ్ళిపోయాడు. కోడలికీ కొడుక్కి కూడా అక్కడ మంచి ఉద్యోగాలు వచ్చాయి. మంచి సంపాదనపరులయ్యారు. చాలా అరుదుగా వచ్చి తల్లిదండ్రుల్ని చూసేవాడు మధువర్మ.

కొన్ని సంవత్సరాల తర్వాత వినయవర్మ ఆరోగ్యం క్షీణించింది. కొడుకుని చూడాలని వున్నా కుదిరేది కాదు.

తల్లి ఎన్నిసార్లు చెప్పినా మన దేశంలో యిల్లు కొనడానికి సుముఖత చూపలేదు మధు. అమెరికాలోనే ఒక యిల్లు ఏర్పాటు చేసుకున్నాడు. వీడిలా మారిపోయాడేమిటని తల్లి బాధపడేది.

ఒకసారి వినయవర్మ భార్యతో అన్నాడు. "పిల్లలు పెద్దవాళ్ళైన తర్వాత తల్లిదండ్రుల యిష్టప్రకారం నడవడమనేది చాలా అరుదుగా జరుగుతుంది! వాడేదో తవ్వి తలకెత్తుతాడని అనుకున్నావు! అసలు కొడుకే మనకళ్ళకు కనపడడం లేదు. ఇంతకంటే మనకి పెద్ద ఆపదేముంది చెప్పు! అందుకే అన్నమయ్య అన్నాడు. 'ఎంత విభవము కలిగె అంతయు ఆపదని తెలిసినది కదా చెడని జీవనము' అని! యిప్పుడైనా అర్థమయిందా వాడు అమెరికా వెడతానంటే నేను ఎందుకు అయిష్టంగా వుండేవాడ్నో!"

"అర్థమయిందండి బాగా అర్థమయింది!"

వినయవర్మకి కొడుకంటే చాలా ప్రేమ వుంది కానీ దేశమంటే యింకా ఎక్కువ ప్రేమ. ప్రతీవాడూ దేశానికి సేవ చెయ్యాలన్నదే అతను నమ్మిన సిద్ధాంతం కాని అతని మాట చెల్లుబడి కాలేదు.

పోను పోను వినయవర్మ ఆరోగ్యం క్షీణించి మంచాన పడ్డాడు. కొడుకుని చూడాలని వుంది కాని వాడికి ఆ మమకారం లేదని బాధపడేవాడు.

'ఎంత వేడుకుందు ఓ రాఘవా పంతమేలరా...చిత్తమందు నిను చూచు సౌఖ్యమే ఉత్తమంబనుచు ఉప్పొంగుచును' అనే త్యాగరాజ కీర్తన మనసులోనే మననం చేసుకుంటూ, చిత్తంలో తన కొడుకును చూసుకుంటూ కాలం గడుపుతున్నాడు వినయవర్మ.

-భమిడిపాటి సోమయాజి (హైదరాబాద్)

☆